క్లుప్తంగా

కుష్టు వ్యాధిపై అశ్రద్ధ వద్దు



అవగాహన కల్పిస్తున్న రాజేంద్రప్రసాద్

గంగాధరనెల్లూరు: కుష్టువ్యాధిపై అశ్రద్ధ వహించరాదని ఆరోగ్య విద్యాధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని పాచిగుంట, కాశేపల్లెలో బుధవారం కుష్టుపై ప్రజలకు అవగాహన కల్పించారు. కుష్టు వ్యాధి లక్షణాలు, వ్యాధి నిర్ధారణకు స్వీయ పరీక్ష, పొందాల్సిన వైద్యం గురించి తెలియజేశారు. వ్యాధి నిర్ధారణ అయిన పక్షంలో 6 నెలల నుంచి 12 నెలల పాటు వైద్యుల పర్యవేక్షణలో క్రమం తప్పకుండా మందులు వాడితే సంపూర్ణ ఆరోగ్యవంతులు కావచ్చన్నారు. అశ్రద్ధ చేస్తే అంగవైకల్యం ప్రాప్తించేందుకు ఆస్కారం ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ జాన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా జాతీయ రహదారి మరమ్మతు



రోడ్డు పనుల్లో కూలీలు

నగరి: మున్సిపల్ పరిధిలో జాతీయ రహదారి మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయి. రోడ్డుపై లేయర్ వేయడంతో భాగంగా రోడ్డును ప్రత్యేక వాహనాలతో శుభ్రం చేశారు. అక్కడక్కడ గాట్లు వేసి నూతన రోడ్డును వేసే పనులు కొనసాగించారు. నగరి పేట నుంచి ఓంశక్తి ఆలయం సమీపం బైపాస్ మీదుగా ఈ పనులు వేగంగా సాగుతున్నాయి.

శరవేగంగా ఆర్చి నిర్మాణం



ఆస్పత్రి వద్ద ఆర్చి నిర్మాణ పనులు

నగరి: స్థానిక ఏరియా ఆస్పత్రికి రోడ్డు లేని కారణంగా ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బంది పడుతుండడంతో ఆ సమస్యను మంత్రి ఆర్కే రోజా పరిష్కరించి, రోడ్డు ఏర్పాటు చేసిన విషయం విదితమే. ప్రస్తుతం ఆ రోడ్డు ముఖద్వారం వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఆర్చి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపులా టైల్స్ వేసి సుందరీకరణ పనులు చేస్తున్నారు. తుడా నిధులతో ఈ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే కార్పొరేట్ ఆస్పత్రి స్థాయిలో ప్రధాన రహదారిని ఆనుకుని ఆస్పత్రి ముఖద్వారం కనిపిస్తుంది.

చిత్తూరు తాలూక సీఐగా గంగిరెడ్డి

చిత్తూరు అర్బన్: చిత్తూరు తూర్పు (తాలూక) సీఐగా ఎం.గంగిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పుంగనూరు అర్బన్ సీఐగా పని చేస్తున్న గంగిరెడ్డిని చిత్తూరు తాలూకకు, ఇక్కడ పనిచేస్తున్న మద్దయ్య ఆచారిని చిత్తూరు టూటౌన్‌కు బదిలీ చేస్తూ ఇటీవల ఉత్తర్వులు వెలువడిన విషయం తెలిసిందే. కాగా శాంతిభద్రతల పర్యవేక్షణలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకు వెళ్లనున్నట్లు గంగిరెడ్డి తెలిపారు.

ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలి

ఐరాల: మండలంలోని రైతులు రబీలో తాము సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ వరలక్ష్మి సూచించారు. బుధవారం స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట బీమా వర్తించాలన్నా, ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై పొందాలన్నా ఈ–క్రాప్ తప్పనిసరి అని పేర్కొన్నారు.

సేవా దృక్పథంతో పనిచేయాలి

బంగారుపాళెం: సేవా దృక్పథంతో పనిచేసినప్పుడే స్వచ్ఛంద సంస్థలకు గుర్తింపు వస్తుందని తహసీల్దార్ బెన్నురాజ్ అన్నారు. బుధవారం స్థానిక గ్రేడ్స్ సంస్థ ఆధ్వర్యంలో 25 మంది వికలాంగులకు ఉచితంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో స్వచ్ఛంద సంస్థలు స్వార్థచింతనతో కాకుండా సేవా గుణంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, సీఐ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రాయితీపై ప్యాకింగ్ షెడ్లు

ఐరాల: మండలంలో మామిడి, ఇతర పండ్ల తోటల్లో ప్యాకింగ్, గ్రేడింగ్ కోసం షెడ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం 50 శాతం (రూ.2 లక్షల వరకు) రాయితీ అందిస్తుందని బుధవారం ఉద్యానశాఖ అధికారి సాగరిక తెలిపారు. 30 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పుతో రెండు తలుపులు, ఎనిమిది కిటికీలు, రేకులతో ప్యాకింగ్ షెడ్లు నిర్మించాలన్నారు. ఆసక్తి కలిగిన రైతులు పట్టాదారుపాసు పుస్తకం , ఆధార్ జిరాక్సు, బ్యాంకు ఖాతా మొదటి పేజీ జిరాక్సులను ఉద్యానశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

సేంద్రియ విధానంతో నాణ్యమైన దిగుబడి

–జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి వాసు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏపీపీఎస్‌ఎఫ్ డీపీఎం వాసు

పాలసముద్రం: సేంద్రియ విధానంలో సాగుతో నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని, మండల రైతులు సేంద్రియ ఎరువుల వాడకానికి ప్రాధాన్యత ఇవ్వాలని చిత్తూరు ఏపీపీఎస్‌ఎఫ్ డీపీఎం వాసు సూచించారు. బుధవారం శ్రీకావేరిరాజుపురం రైతు భరోసా కేంద్రంలో సచివాలయ సిబ్బంది, రైతులకు సర్పంచ్ గాలి మహేష్ బాబు అధ్యక్షతన సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, ఆయన మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయ విధానంలో సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులతోపాటు నికర ఆదాయం పొందవచ్చన్నారు. రసాయన ఎరువుల వాడకం పట్ల ఆహారోత్పత్తులు విషతుల్యమవుతున్నాయని, వీటికి స్వస్తి పలకాలన్నారు. విత్తన శుద్ధికి జీవామృతం, సస్యరక్షణకు పేడ, గో పంచితం, కషాయం వంటివి పంటలకు విని యోగించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వనజ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

శ్రీరంగరాజపురం: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి వాసు అన్నారు. బుధవారం మండలంలోని మంగుంట గ్రామానికి చెందిన రైతు శేషాద్రి ప్రకృతి వ్యవసాయ విధానాలతో సాగు చేసిన చెరకు నుంచి తయారు చేస్తున్న బెల్లాన్ని ఆయన పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన బెల్లాన్ని తిరుమల–తిరుపతి దేవస్థానం కొనుగోలు చేస్తోందన్నారు. ప్రతి రైతూ ఈ విధానంలో చెరకు సాగు చేసినట్లయితే టీటీడీ రైతాంగానికి చేయూతనిస్తుందన్నారు.



మంగుంట వద్ద బెల్లం తయారీని పరిశీలిస్తున్న జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి వాసు

పంట నమోదు తప్పనిసరి



అన్నూరు వద్ద మామిడిలో అంతర్ పంట సాగును పరిశీలిస్తున్న హబీబ్‌బాషా

• జిల్లా వ్యవసాయశాఖాధికారి హబీబ్‌బాషా

కార్వేటినగరం: రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలకు ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి హబీబ్‌బాషా అన్నారు. బుధవారం మండలంలోని రైతులు రబీలో సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదు చేసుకున్న వారి వివరాలను తనిఖీ చేశారు. అలాగే పలువురు రైతులు సాగు చేసి వేరుశనగ, మినుము, అలసంద, మామిడి పంటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. అలాగే అన్నూరు, గొపిశెట్టిపల్లె, ఆళత్తూరు ఆర్బీకేలను సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయశాఖాధికారి మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పంటలకు విధిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని చెప్పారు. పంట నమోదు చేసుకోవడంతో పంటల బీమా, సున్నావడ్డీ తదితర పథకాలకు అర్హులవుతారని సూచించారు. అనంతరం ఆర్కేవీబీపేట వద్ద మామిడిలో అంతర్ పంటగా సాగు చేస్తున్న మినుము, అలసంద పంటలను పరిశీలించారు. అలాగే అన్నూరు వద్ద వరి పంటను పరిశీలించి చీడపీడల నివారణకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ వ్యవసాయాధికారి మధుసూదన్‌రెడ్డి, మండల వ్యవసాయ ఆధికారి హేమలత, ఏఈఓలు గాయత్రి, హేమాద్రి పాల్గొన్నారు.

క్రీడాకారులకు శిక్షణ

కార్వేటినగరం: స్థానిక జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో బుధవారం అండర్–14 విభాగంలో బాలబాలికలకు వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ఎంపీపీ లత ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ, క్రీడలపై ఆసక్తి కలిగిన గ్రామీణ విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధితో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చెంగల్‌రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, పార్టీ మండల కన్వీనర్ ధనంజయ వర్మ, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ సురేష్‌బాబు, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వర రావు, పీఈటీలు, పీడీలు, మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 30మంది క్రీడాకారులు పాల్గొన్నారు.



వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించిన డీఎం పురం విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం నమశ్శివాయ

కార్వేటినగరం: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో తమ స్కూలు విద్యార్థి శశిరం ప్రతిభ కనబరచాడని డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నమశ్శివాయ తెలిపారు. బుధవారం ఆ విద్యార్థిని హెచ్‌ఎంతోపాటు పీఈటీ తిరుమల రాజు, టీచర్లు అభినందించారు. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు పశ్చిమ గోదావరి జిల్లాలో పెదవేగిలో నిర్వహించిన అండర్–14 కేటగిరి సాఫ్ట్‌బాల్ పోటీలలో జిల్లా జట్టు రన్నర్స్‌గా నిలిచింది. జట్టులోశశిరం తన సత్తా చాటాడని హెచ్‌ఎం చెప్పారు.

చిట్టిబాబూ..! నోరు అదుపులో పెట్టుకో

శ్రీరంగరాజపురం: చంద్రబాబు, లోకేష్ వద్ద మెప్పు పొందడానికి టీడీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ చిట్టిబాబునాయుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామిపై అవాకులు, చెవాకులు పేలుతున్నారని, నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అవినీతికి తావు లేకుండా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కళత్తూరుపై ఆరోపణలు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. యువగళం పాదయాత్ర పేరిట లోకేష్ బెంగళూరులో ఉంటున్న బిల్డర్ల వద్ద చందాలు, వసూళ్లకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. చిట్టిబాబు చేస్తున్న అవినీతి గురించి అతనితో ఉంటున్న వారే బాహాటంగా విమర్శిస్తున్నారని, ఇది విస్మరించి మరొకరిపై కువిమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విజయబాబు, దేవరాజులురెడ్డి, బాబు, యోగానందం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యంరెడ్డి

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం: స్థానిక ఆరోగ్య ఉపకేంద్రంలో బుధవారం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు డాక్టర్ మోహన్‌కృష్ణ వైద్యపరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. పిల్లల్లో రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు ఇవ్వాలని సూచించారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, మురళి పాల్గొన్నారు.

‘ఫ్యామిలీ డాక్టర్’ను సద్వినియోగం చేసుకోవాలి

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని వైద్య సేవలు పొందాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. బుధవారం మండలంలోని మల్లకుంటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో డాక్టర్ ప్రియంక 97 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గర్భిణులు, చిన్న పిల్లలు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించాలనే సంకల్పంతో ఫ్యామిలీ ఫిజీషియన్(డాక్టర్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు ప్రతి నెల పరీక్షలు చేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రియాంక

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లెలో బుధవారం విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. చిందేపల్లె, ఎస్సీ, ఎస్టీ కాలనీలలో 24 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. దీంతట్రాన్స్‌కో అధికారులు కొత్త సంభాలను ఏర్పాటు చేశారు. సర్పంచ్ పెంచలయ్య పర్యవేక్షించారు.

గేట్ వసూళ్లు గెజిట్ ప్రకారమే జరగాలి

పుత్తూరు రూరల్: మున్సిపాలిటీ కూరగాయల మార్కెట్ గేట్ వసూళ్లలో కాంట్రాక్టర్ గెజిట్ ప్రకారమే వసూలు చేయాలని కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 6వ తేదీన తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో స్థానిక సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి గేట్ వసూళ్లలో కాంట్రాక్టర్ అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదు చేశారు. దీనిపై బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదుదారులు మురగారెడ్డి, చిన్నా, కాంట్రాక్టర్ బైపాస్‌రాజాను కమిషనర్ పిలిపించి, విచారణ జరిపారు. ఇరు వర్గాల వాదనల విన్న అనంతరం కమిషనర్ మాట్లాడుతూ గెజిట్ ప్రకారమే వసూళ్ల చేపట్టాలని, ఇందులో ఎవరికీ ఎలాంటి మినహాయింపు ఉండదని తేల్చి చెప్పారు. మరోసారి ఫిర్యాదు వస్తే చర్యలు తప్పదని హెచ్చరించారు.



ఇరువర్గాలతో చర్చిస్తున్న కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి

మార్కెట్ యార్డు అభివృద్ధికి సహకరించరూ!

• వ్యవసాయశాఖ మంత్రికి వినతి

పెనుమూరు(కార్వేటినగరం): రాష్ట్ర మార్కెటింగ్, వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని పెనుమూరు మండల మార్కెటింగ్ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామితో పాటు విజయవాడలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.పెనుమూరు మార్కెట్ యార్డులో అభివృద్ధి పనులకు సహరించాలని మంత్రిని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఏఎంసీ డైరెక్టర్ పీ.ప్రసాద్‌రెడ్డి, కావూరివారిపల్లె పంచాయతీ సర్పంచ్ నవీన్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.



వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఏఎంసీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి

ప్రతి మహిళా ఓ శక్తిగా ఎదగాలి

చిత్తూరు అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ప్రతి మహిళ ఓ శక్తిగా ఎదిగి ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ తులసి అన్నారు. బుధవారం స్థానిక టీటీడీసీ కేంద్రంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, స్నేహ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళలకు టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రాథమికంగా పట్టణ ప్రాంతాల్లో మహిళలకు ఉచితంగా నెలరోజుల పాటు టైలరింగ్ శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టమన్నారు. త్వరలోనే గ్రామీణ ప్రాంత మహిళలకు కూడా టైలరింగ్ శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలియజేశారు. అనంతరం ఆమె శిక్షణకు వచ్చిన మహిళలకు శిక్షణ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాబ్స్ జేడీఎం సరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు టైలరింగ్ కిట్లను అందజేస్తున్న డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ తులసి

చేపల చెరువుల వేలం

నారాయణవనం: మండలంలోని రెండు చెరువులను చేపల పెంపకానికి నిర్వహించిన వేలంలో పంచాయతీలకు రూ 5,16,600 ఆదాయం లభించిందని ఈఓపీఆర్‌డీ డాక్టర్ వేణయ్య తెలిపారు. బుధవారం కల్యాణపురం, తిరువట్యం చెరువులను వేలం చేశారు. కల్యాణపురం చెరువు వేలంలో రూ.20,600, తిరువట్యం చెరువు వేలంలో రూ 4,96,000 ఆదాయం లభించిందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సారకాయలు, సర్పంచ్‌లు నాగూరు, మునెమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం తనిఖీ

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక భవిత కేంద్రాన్ని బుధవారం ఎంఈఓ రవీంద్రనాథ్ తనిఖీ చేశారు. ప్రత్యేక ప్రతిభావంతులకు వివిధ ప్రశ్నలను వేసి జవాబులు రాబట్టారు. ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రంలో 16 మంది ప్రత్యేక ప్రతిభావంతులున్నారని చెప్పారు. ఇక్కడికి వచ్చే పిల్లలకు ప్రతి నెలా రవాణా ఖర్చులు ఇస్తామన్నారు. గ్రహణమొర్రి ఉన్న పిల్లలకు శస్త్ర చికిత్స సర్వశిక్షా అభియాన్ పథకంలో చేయిస్తారన్నారు. ఐఈఆర్‌టీఏస్‌లు ఆయప్ప, జయప్రకాష్ పాల్గొన్నారు.





ముంచు కురిసే.. పాళెం మురిసే..

పొద్దు పొడిచే వేళ.. మంచుకురిసే సమయం కౌండిన్య శివారులోని బంగారుపాళెం అందానికి సరికొత్త శోభ సంతరించుకుంది. మొగలి ఘాట్ అందాలకు మంచు ముసుగు మరింత సొగసు తోడై ప్రకృతి ప్రేమికుల మనస్సు దోచేసింది. చలిని సైతం లెక్క చేయకుండా పర్యావరణ ప్రేమికులు ఆ అందాలను చూసి పరవశించిపోయారు. బంగారుపాళెంలో బుధవారం ఉదయం పొగమంచు ఆవరించింది. ఈ దృశ్యం సందర్శకులను అలరించింది.

–బంగారుపాళెం



రాష్ట్రస్థాయి పోటీల్లో ఐరాల విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలో సత్తాచాటిన విద్యార్థులతో ఎంఈఓ

ఐరాల: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్–14 బాలికల విభాగం పోటీల్లో జిల్లా జట్టు తరుపున పాల్గొన్న ఐరాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారనిఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు, పెద్దవేగి క్రీడామైదానంలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్–14 బాలికల విభాగం పోటీల్లో జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచి, కాంస్య పతకం సాధించిందని ఆయన తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులు దివ్యశ్రీ, యువశ్రీ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి సత్తా చాటారని చెప్పారు. అలాగే ఇటీవల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–14 బేస్‌బాల్ బాలికల విభాగంలో జిల్లా జట్టు రెండో స్థానం సాధించి, రజిత పతకం కైవసం చేసుకుందని, ఈ పోటీలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు రూప, వర్షిణి, యువశ్రీ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఈ సందర్భంగా ఐల గురివిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గోపాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఈశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, క్రీడాకారులను అభినందించి, జ్ఞాపికల అందజేసి, సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విజయలక్ష్మి, పీఎంసీ చైర్మన్ రవీంద్రరెడ్డి, పీడీలు దేవా,శివ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల హర్షం

గంగాధరనెల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయీ బ్రాహ్మణులకు దేవదాయ శాఖలో స్థానం కల్పించడంపై బుధవారం నాయీ బ్రాహ్మణుల జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, స్థానిక నాయీ బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమైన ఆలయాల్లో బోర్డు సభ్యుల్ని నియమిస్తామని సీఎం ప్రకటించడం ఆయన ఉదారతకు నిదర్శనమని, జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని వారు కృతజ్ఞతలు తెలిపారు.

నీలకంఠేశ్వరాలయంలో మహా కుంభాభిషేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మహా కుంభాభిషేక పూజలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం వరకు పూజలు చేయనున్నారు. తొలిరోజున కలశ స్థాపన, వినాయక పూజ,మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో హోమ పూజలు చేస్తున్న వేదపండితులు